క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నందికొట్కూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, విలేకరులకు ఉచితంగా బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పోలీసులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్‌ఐలు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ ధనిబాబు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పంచాయతీ రాజ్ శాఖ నందికొట్కూరు డివిజనల్ ఇంజినీర్ ధనిబాబు గురువారం పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మండల వ్యాప్తంగా 34 పనులకు రూ. 2.5 కోట్లు మంజూరైనట్లు డీఈ వెల్లడించారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత పాటించాలని, 21 రోజుల పాటు క్యూరింగ్ తప్పనిసరి చేయాలని చెప్పారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ సురేంద్రనాథ్, మండల ఇంజినీర్ జావేద్ ఉన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



శాతనకోటలో ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం మండలంలోని శాతనకోట, అల్లూరు గ్రామాలకు చెందిన సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అపార్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

మిస్సింగ్ కేసు నమోదు



మురుగేసి వెంకటేశ్వర్లు (ఫైల్)

కొత్తపల్లి: ఓ యువకుడు పనికోసం హైదరాబాదుకు వెళ్లి కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శేషవ గురువారం తెలిపారు. వివరాలు.. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మురుగేసి రాములమ్మకు ముగ్గురు కుమారులు. మూడవ కుమారుడు మురుగేసి వెంకటేశ్వర్లు (26) 2021 జూన్ నెలలో ఇంటినుంచి హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వెళ్లి అక్కడ ఓ స్వీట్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. మూడేళ్ల నుంచి ఫోన్ చేయలేదని, కనీసం గ్రామానికి కూడా రాలేదని, అతని ఆచూకీ లేదని చెప్పారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో రాములమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

26 నుంచి రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు

నందికొట్కూరు: ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. గురువారం పట్టణంలోని నవనంది హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవనంది హైస్కూల్ సహకారంతో ఆ పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన బాలబాలికలకు డిసెంబరు 22 నుంచి 26 తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారన్నారు. పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

నిర్లక్ష్యంపై కన్నెర్ర

అత్యంత మహిమాన్విత శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులకు అన్నప్రసాదంలో అరకొర పదార్థాలనే వడ్డిస్తున్నారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించి స్వీకరించే అన్నప్రసాద వితరణపై పర్యవేక్షణ కొరవడటంతో అక్కడి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. తయారు చేసిన ప్రతి పదార్థం చివరి భక్తుడి వరకు చేరాలని ఎన్నిసార్లు చెబుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఈ క్షేత్రంలో పరిపాటిగా మారిన విషయం ఇటీవల దేవస్థాన ఈఓ తనిఖీలో వెల్లడైంది. తనిఖీ సందర్భంగా భోజనాన్ని రుచి చూశారు. భక్తులకు కొన్ని ఆహార పదార్థాలనే వడ్డిస్తుండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యవేక్షించాల్సిన అధికారి సైతం అందుబాటులో లేకపోవడంతో సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు గుమస్తాలు, 8 మంది కుక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. – శ్రీశైలంటెంపుల్

- శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణలో భక్తులకు అరకొర పదార్థాల వడ్డన
- ఈఓ తనిఖీలో తేటతెల్లం
- పర్యవేక్షకులను సస్పెండ్ చేసిన ఈఓ
- ముగ్గురు గుమస్తాలు,

8 మంది కుక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ



అన్నప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



శ్రీశైల ఆలయం

శ్రీశైల మహాక్షేత్రాన్ని రోజూ వేలాది మంది భక్తులు సందర్శిస్తున్నారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అన్నప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు అన్నప్రసాద వితరణలో ఒక స్వీటు, అప్పడం, నెయ్యి, ఆకు/కాయగూర పప్పు, ఒక ఇగురు కూర, సాంబార్, మజ్జిగ వడ్డించాలి. అలాగే సాధారణ రోజుల్లో (మంగళవారం నుంచి శుక్రవారం వరకు) రోజుకు 4వేల మందికి, రద్దీ రోజుల్లో (శని, ఆది, సోమవారాల్లో) 5 నుంచి 6వేల మందికి మధ్యాహ్నం భోజనం అందిస్తారు. కార్తీక మాసం రద్దీరోజుల్లో 8 నుంచి 9 వేల మందికి అందిస్తారు. మొదటి వ్యక్తికి అందిన ఆహార పదార్థాలు చివరి వ్యక్తికి కూడా అందాలనే ఆదేశాలు ఉన్నాయి. అలాగే రాత్రి భక్తులకు అల్పాహారం అందిస్తారు. అన్నప్రసాద వితరణకు సరాసరి నెలకు సుమారు రూ.20 లక్షలకు పైగా విరాళాలు అందుతాయి. అన్నప్రసాద వితరణకు భక్తులు సమర్పించే విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. వాటి(ఎఫ్.డీల) ద్వారా వచ్చే వడ్డీ డబ్బులతో అన్నప్రసాదాన్ని అందిస్తారు.

భక్తుడి మాదిరిగా వెళ్లి..భోజనం చేసి..

శ్రీశైల దేవస్థాన ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ దేవస్థాన పరిపాలనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పలు ఇంజినీరింగ్ పనులను స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. అన్నప్రసాద వితరణ భవనానికి భక్తుడి మాదిరిగా వెళ్లి భక్తులతోపాటు సంపక్తి భోజనం చేశారు. భోజనంలో కొద్దిగా గోరుచిక్కుడు కూర వడ్డించారు. పప్పు అడుగగా అయిపోయిందని బదులిచ్చారు. కమిషనర్ ఆమోదించిన దిట్టం ప్రకారం వడ్డించకుండా అరకొర ఆహార పదార్థాలే వడ్డిస్తున్నారని పలువురు భక్తుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

పర్యవేక్షకులపై సస్పెన్షన్ వేటు

స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై వచ్చే భక్తులకు సరిపడా కూరలు, పప్పు, అన్నప్రసాద వితరణలో జరిగేటట్లు చూచుకోక నిర్లక్ష్యం వహించాడని, సాధారణ రోజుల్లో, రద్దీ రోజుల్లో క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుల సంఖ్యపై అవగాహన ఉంచి, రద్దీ ప్రకారం భక్తులకు సరిపడా భోజన పదార్థాలు తయారు చేయించడంలో విఫలమయ్యారని, పర్యవేక్షకులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారని, ఉన్నతాధికారులు పలుమార్లు హెచ్చరించినా బేఖాతర్ చేశారనే అభియోగాలపై అన్నప్రసాద వితరణ విభాగం పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డిని, ఏపీ దేవదాయ క్రమశిక్షణ రూల్స్‌లోపి 8లోని నిబంధనల ప్రకారము తక్షణమే విధుల నుంచి తాత్కాలికంగా నిలుపుదల (సస్పెండ్) చేస్తూ శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 14రోజుల్లో సంజాయిషీ లేఖను దేవస్థాన కార్యాలయానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జ్ పర్యవేక్షకులుగా జి.రవి, డొనేషన్ కౌంటర్, క్యూ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ పర్యవేక్షకులుగా ఎం.మల్లికార్జునను నియమించారు.

అన్నప్రసాద వితరణపై మంత్రి ఆగ్రహం

ఈ నెల 9న రాష్ట్ర సీఎం శ్రీశైలంలో పర్యటించారు. సీఎం పర్యటనను పురస్కరించి పలువురు వీఐపీలు, వీవీఐపీలు శ్రీశైలం చేరుకుని భ్రమరాంబా అతిథిగృహంలో బస చేశారు. వీరికి దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనం నుంచి భోజనాలు తీసుకువచ్చారు. ఉడకని అన్నం, ముదురు బెండకాయ ఫ్రై, ఉప్పు లేని పప్పు వడ్డించడంతో వీఐపీలు, వీవీఐపీలు ఇబ్బందులు పడ్డారు. దేవస్థాన అన్నప్రసాదాన్ని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి స్వయంగా రుచి చూసి తనకే ఇటువంటి భోజనం పెడితే ..ఇక భక్తులకు ఎలాంటి భోజనం వడ్డిస్తున్నారో అర్థమవుతుందని సిబ్బందిపై ఆగ్రహించారు. ఈ ఘటనపై అన్నప్రసాద వితరణ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు గుమస్తాలకు, ఎనిమిది మంది కుక్‌లకు షోకాజ్ నోటీసులు దేవస్థాన ఈఓ జారీ చేశారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

పాములపాడు: గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీఓ రాంబాబు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాల వివరాలు పీఆర్‌ఓ యాప్‌లో రిపోర్టులు పొందుపర్చాలని చెప్పారు. గ్రీన్ అంబాసిడర్స్ వేతనాలు చెల్లించాలని, ఎల్‌ఈడీ బల్బులు, సీసీ చార్జీలు చెల్లించాలన్నారు. శానిటేషన్, మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీపీఆర్‌సీ రీసోర్స్ పర్సన్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు మండల నాయకుడు మేకల రాజు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద డీఎల్‌పీఓ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభ సమయంలో ఇచ్చిన చెత్త బండ్లు ప్రస్తుతం దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే కార్మికులకు జాకెట్లు, గ్లౌజులు, సబ్బులు అందడం లేదని, చివరకు వేతనాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తామని, మిగతా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ హామీనిచ్చారు.

ఎన్‌సీడీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సర్వే వివరాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి

జూపాడుబంగ్లా: ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సర్వే పకడ్బందీగా చేపట్టి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ కె.జగదీష్‌చంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను పరిశీలించటంతోపాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)ను తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ), ఓపీ తదితర రికార్డులను పరిశీలించి నిత్యం నీటి పరీక్షలు నిర్వహిస్తున్నారా, ఎన్‌సీడీ సర్వే సక్రమంగా చేస్తున్నారా అంటూ డాక్టర్ యశశ్వినిని ఆరా తీశారు. ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ టెస్టులు సక్రమంగా నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, సుగర్, బీపీ తదితర వ్యాధిగ్రస్తుల వివరాలను సక్రమంగా రికార్డుల్లో నమోదు చేసి నిత్యం పర్యవేక్షించటంతో పాటు వారి ఆరోగ్యం కుదుటపడేందుకు అవసరమైన మందులను అందజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. సర్వేలో సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ బీసమ్మ, గీతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు చిన్నక్క, ఇందిరమ్మ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి సార్!

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 552 జాబ్ కార్డులుండగా 1,100 మంది వ్యవసాయ కూలీలున్నారు. వారిలో 490 జాబ్‌కార్డులకు చెందిన 910 మంది వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి నెలాఖరు వరకు గ్రామానికి 15,456 పని దినాలు కేటాయించారు. అందులో ఇప్పటిదాకా కేవలం 4,692 పనిదినాలు మాత్రమే కల్పించగా 30 శాతం మేర పనిదినాలు ముగిశాయి. గ్రామంలో పనులు చూపాలని కూలీలు కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల కల్పన విషయంలో జూపాడుబంగ్లా మండలం వెనుకబడి ఉందని వెంటనే వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మండల పథకం అధికారులను పలుమార్లు ఆదేశించినా స్పందన లేకపోయింది. మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు కల్పించి తమ గ్రామంలో కల్పించకపోవటం వెనుక ఆంతర్యమేమిటని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే పనులు చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలివ్వాలి

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో 40 ఏళ్ల నుంచి నివసిస్తున్న ఎరుకలి కులస్తులకు ప్రభుత్వం స్థలాలిచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలోని ఎరుకలిపేటలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా 20 కుటుంబాలకు చెందిన 100 మంది జీవిస్తున్నారని తెలిపారు. వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసిన దాఖలాల్లేవన్నారు. అలాగే కాలనీకి సిమెంటు రోడ్డు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో వారు పందులను పెంచుకొంటూ గుడిసెల్లో తలదాచుకొంటున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. వారిలో కొందరికి ఆధార్, రేషన్‌కార్డుల్లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. గిరిజన సంఘం నాయకులు సుబ్బన్న, నడిపి సుబ్బన్న, వెంకటేశ్వర్లు, నడిపి సుద్దన్న, గంగన్న పాల్గొన్నారు.

• వృథా అవుతున్నా పట్టించుకోరా?



కొత్తపల్లి: పంట కాలువలు పూడిపోవడం, కాలువలకు వేసుకున్న పైపులు మూసుకుపోవడంతో ఎత్తిపోతల నుంచి విడుదలైన నీరు వృథాగా పోతుంది. వృథా నీరు రోడ్డు ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.. మండలంలోని కొక్కెరంచ గ్రామం నుంచి ఆత్మకూరు పట్టణానికి వెళ్లేదారిలో కొత్తమాడుగుల గ్రామ సమీపంలో బీటీ రహదారిపై లింగాల ఎత్తిపోతల పథకం నుంచి పంట పొలాలకు పారుతున్న సాగునీరు పంట కాలువలు సరిగాలేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనితో రహదారి దెబ్బతింటోందని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

కొత్తమాడుగుల సమీపంలో రోడ్డుపై వృథాగా పారుతున్న ఎత్తిపోతల పథకం నీరు

సారా బెల్లం వ్యాపారం చేస్తే కేసు

నందికొట్కూరు: నాటు సారా బెల్లం వ్యాపారం చేస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో హోల్‌సేల్ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా యారు చేసేందుకు ఉపయోగించే బెల్లం విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పట్టణంలోని నీలిషికారిపేట, కోళ్లబావాపురం గ్రామ ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలుగా గుర్తించామన్నారు. చట్ట ప్రకారం లైసెన్స్ పొందిన వారే బెల్లం వ్యాపారం చేయాల్సి ఉంటుందని, ఒక వ్యక్తికి ఐదు కిలోల బెల్లం మాత్రమే అమ్మాలని ఎక్కువ అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లం క్రయ, విక్రయాల వివరాలను 15 రోజులకు ఒకసారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా ఉన్నారు.

పంటల బీమా చేయించుకోండి

పాములపాడు: రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు డిసెంబర్ 15 చివరి తేదీ అన్నారు. వరి పైరుకు డిసెంబర్ 31వ తేదీ వరకు సమయం ఉందన్నారు. బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంక్‌ల్లో సంప్రదించాలన్నారు. లోన్ తీసుకోని వారు సీఎస్‌సీ, ఎన్‌సీఐపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వన్ బీ, భూమి పాసుబుక్కు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు బుక్, మొబైల్ నంబరు, వీఏఏ/వీహెచ్‌ఏ/వీఎస్‌ఏ వారిచే జారీ చేబడిన క్రాప్ లోన్ సర్టిఫికెట్, కౌలు దారుడైతే సీసీఆర్‌సీ కార్డుతో పంటల బీమా చేయించుకోవాలని వివరించారు.

ఓటు హక్కుకు నమోదు చేసుకోండి

నందికొట్కూరు: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అంతరాయం కలగనివ్వం

కొత్తపల్లి: గ్రామాల్లో ఎక్కడా కూడా విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామని లైన్‌ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. గురువారం సిబ్బందితో కలసి మండలంలోని జి.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామా ల్లో విద్యుత్ మరమ్మతులు నిర్వహించారు. విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే తీగలను సరి చేసి సరఫరాను పునరుద్ధరించారు.

వైద్యసేవలు అందించండి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు, స్థానికులకు అవసరమైన వైద్యసేవలను అందించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ సూచించారు. గురువారం దేవస్థాన వైద్యశాలను ఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఏ సమయంలోనైనా అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా దేవస్థానం వైద్యశాలలో ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దేవస్థానం వైద్యశాలను మరింతగా అభివృద్ధి పరిచి, మెరుగైన సేవలు అందించేందుకు అపోలో వైద్యులు, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. సమసావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యురాలు



శ్రీశైల ప్రధాన ఆలయం వద్ద జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యురాలు డా.ఆశ లక్రా దర్శించుకున్నారు. గురువారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆమెకు దేవస్థాన అధికారులు, అర్చకులు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.వి.శివప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం ఆమె మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంతారలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

మొక్కలు నాటిన ఆర్‌డీఓ



మొక్కలు నాటుతునన్న ఆర్‌డీఓ నాగజ్యోతి

ఆత్మకూరురూరల్: స్థానిక ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఆర్‌డీఓ నాగజ్యోతి మొక్కలు నాటారు. కార్యాలయ ఆవరణను పచ్చదనంతో నింపాలన్న సదాశయంతో కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ పనుల ప్రారంభం

మహానంది: గ్రామాల్లో, పంట పొలాల వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసే పనులను సిబ్బంది గురువారం ప్రారంభించారు. ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న తీగలను ఎత్తులో ఏర్పాటు చేసేందుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో ఎక్కడైనా సరే ప్రమాదకరంగా ఉన్న తీగలను వెంటనే సరి చేయాలని ఇప్పటికే ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవ పూజలందుకున్న స్వామీ అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గురువారం కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి దంపతుల కల్యాణ క్రతువును భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. వివాహాలు జరగడంతో సాధారణ భక్తులతోపాటు ఆలయ ప్రాంగణాల్లో భక్తులసందడి కనిపించింది. కాగా తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి సిబ్బంది అదనంగా వసూలు చేశారు. కాగా పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి వచ్చిన వారి నుంచి రూ.500 నుంచి రూ.1,000 వరకు డిమాండ్ చేస్తుండగా సాధారణ భక్తులకు తలనీలాలకు రూ.100 ఇవ్వాల్సిందేనంటూ కొందరు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



నెహ్రూనగర్‌లో నిరుపయోగంగా ఉన్న సచివాలయాల భవన సముదాయం



కొత్త ముచ్చుమర్రిలో సుందరంగా రూపుదిద్దుకున్న సచివాలయ భవనాలు

ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో లక్షలాది రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న సచివాలయ భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో సచివాలయ సిబ్బంది పాత భవనాల్లోనే విధులు కొనసాగిస్తున్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్స్ లేని పాత భవనాలలో ఉద్యోగినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణాతీతం. సర్వ హంగులతో పూర్తయిన గ్రామ సచివాలయ భవనాలను ఎందుకు ప్రారంభించడం లేదో స్థానికులకు అంతుచిక్కడం లేదు. జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన ఈ భవనాలు ప్రజల సేవకు ఉపయోగపడక పోగా తాగుబోతులకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఆశయంతో జగనన్న ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అమలు చేసి దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మండలానికి పది గ్రామ సచివాలయాలు మంజూరు కాగా సచివాలయ భవనాలు, ఆర్‌బీకే సెంటర్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్‌మిల్క్ సెంటర్‌లను మంజూరు చేసి నిర్మించారు. ఆ భవనాలు పూర్తయినా వినియోగంలోకి తేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగులు సైతం అసౌకర్యానికి గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు స్పందించి వాటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.